RNI No: APTEL/2018/76747



Wanted Reporters: 9618907705

# నవతరం

DYNAMIC EDITION తెలుగు దినపత్రిక

| హైదరాబాద్ | శుక్రవారం | సంపుటి: 9 | సంచిక: 242 | పేజీలు: 04 | వెల: 5 /- | 11 సెప్టెంబర్ 2026 |

## 'లక్ష్మీనారాయణ' చెరువును కాపాడండి

**హైదరాబాద్, నవతరం:** మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ గ్రామంలోని లక్ష్మీనారాయణ చెరువును కాపాడాలని అక్కడి స్థానికులు, మత్స్యకారులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల మేరకు గురువారం చెరువును ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్త, హైడ్రా అడిషనల్ కమిషనర్ డి. ఆనంద్ కుమార్ తో కలిసి హైడ్రా కమిషనర్ సందర్శించారు. గణేష్ నిమజ్జనానికి అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అన్ని పార్టీలకు చెందిన నాయకులు, స్థానికులు పెద్దమొత్తంలో హైడ్రా కమిషనర్‌ను కలిసి.. చెరువు చరిత్రను వివరించారు. కాలుష్యం భారిన పడిన చెరువును కాపాడాలని కోరారు. 600ల ఎకరాలకు పైగా ఉన్న ఈ చెరువు తాగునీరు, సాగునీరు అందించేదని.. ఇప్పుడు కలుషితమైపోయిందని వాపోయారు. నగరంలో పలు చెరువులను హైడ్రా అభివృద్ధి చేయడంతో పరిసరాల రూపురేఖలు మారిపోయాయని.. ఆ క్రమంలోనే ఏదులాబాద్‌లోని లక్ష్మీనారాయణ చెరువును కూడా అభివృద్ధి చేయాలని కోరారు. ఈ చెరువు నీటిని తాకితే చేతులకు జిగురులా అంటుకుంటోందని.. అంతటి స్థాయిలో కాలష్యం ఉండడంతో ఇందులో చేపలు చనిపోయాయన్నారు. చుట్టుపక్కల బోర్లలో కలుషిత జలాలు వచ్చి బీపీ, థైరాయిడ్, క్యాన్సర్, సంతానలేమి వంటి సమస్యలను ఎదుర్కొంటున్నామన్నారు. పైన ఉన్న జవాహార్‌నగర్ డంప్ యార్డు వ్యర్థాలు మురుగు నీరుద్వారా చెరువులో కలిసి జలాలు కలుషితం అయ్యాయని వాపోయారు. జవహార్‌నగర్ నుంచి వచ్చే మురుగు నీరు చెరువులోకి కలవకుండా నాలాను డైవర్ట్ చేస్తే చాలావరకు సమస్య పరిష్కారమౌతుందని తెలిపారు. చారిత్రక నేపథ్యం ఉన్న ఈ చెరువును బాగు చేసేందుకు త్వరలోనే సమావేశాన్ని ఏర్పాటు చేసి సరైన ప్రణాళికతో ముందుకు వెళ్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ స్థానికులకు హామీ ఇచ్చారు.

**చెరువుల అభివృద్ధి పూర్తి కావాలి..**

ఉప్పల్ నల్లచెరువు, నాచారం చెరువు, రామంతాపూర్‌లోని పెద్ద చెరువు పునరుద్ధరణ పనులు వేగంగా జరగాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అధికారులకు సూచించారు. ఉప్పల్ నల్లచెరువును నవంబరులో ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారని.. అప్పటికి చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని కోరారు. చెరువు అభివృద్ధిలో భాగంగా సెడిమెంటేషన్ ట్యాంకులను, చెరువు కట్టతో పాటు.. ఇన్‌లెట్లు, ఔట్‌లెట్లను పరిశీలించారు. చెరువు చెంత ప్రభుత్వ భూమికి చెందిన సర్వే నంబరు155లో తాత్కాలిక షెడ్డులను ఖాళీ చేయించి వెండర్లకు అక్కడ అవకాశం కల్పించేందుకు తాము ప్రయత్నిస్తున్నామని.. ఇందుకు హైడ్రా సహకరించాలని ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్త కమిషనర్‌ను కోరారు. చెరువుల అభివృద్ధిని విమోస్ టెక్నోక్రాట్స్ డైరెక్టర్ యూనస్ కమిషనర్‌కు సందర్భంగా వివరించారు. ఉప్పల్ నల్లచెరువు చుట్టూ బయోడైవర్సిటీని పెంపొందించాలని సూచించారు. నాచారం చెరువు చుట్టూ పాత్‌వేపైకి వాహనాల రాకపోకలు సాగిస్తుండడంతో భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయని స్థానికులు హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఉప్పల్ వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గాలున్నాయని.. వాటిని వినియోగించుకునేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ విషయమై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎంత లోతు అవసరమైతే అంత మేర తవ్వి చెరువులో దశాబ్దాలుగా పేరకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, పూడికను తొలగించాలని సూచించారు. అనంతరం రామంతాపూర్‌లోని పెద్ద చెరువును సందర్శించారు. డబుల్ బెడ్ రూం ఇళ్ల మంజూరీలో తమ పేర్లు జోడించినందుకు హైడ్రా కమిషనర్ కు అక్కడ గతంలో గుడిసెలు కోల్పోయిన వారు కృతజ్ఞతలు తెలిపారు. చుట్టూ లక్షలాది మంది నివాసాలుంటున్నారు.. వారికి ఈ చెరువు ఎంతో ఆహ్లాదాన్నిస్తుందని కమిషనర్ చెప్పారు. ఆ విధంగా చెరువును త్వరగా అభివృద్ధి చేయాలని సూచించారు.











## హాస్టల్ నిర్వాహకులకు '3 నెలల గడువు'

- **జనవరి 1వ తేదీ నుంచి హైడ్రా తనిఖీలు**
- **ప్రమాదాల నివారణకు హైడ్రా చర్యలు**
- **భద్రత విషయంలో రాజీలేదన్న హైడ్రా కమిషనర్**

**హైదరాబాద్, నవతరం;** హాస్టళ్లలో ఉన్న వారి భద్రత విషయంలో రాజీ పడమని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. ప్రమాదకరమైన భవనాల్లో హాస్టళ్లు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పటిష్టమైన కట్టడాలతో పాటు అన్ని అనుమతులున్న భవనాల్లోనే హాస్టళ్లు నిర్వహించాలని సూచించారు. ప్రమాదకరమైన భవనాల్లో హాస్టళ్లు నిర్వహిస్తున్నవారు పటిష్టమైన భవనాల్లోకి వాటిని తరలించాలన్నారు. ఇందుకు గాను 3 నెలల గడువును నిర్దేశించారు. వీలైనంత త్వరగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకోవాలని సూచించారు. జనవరి 1వ తేదీ నుంచి తనిఖీలు నిర్వహిస్తామని.. కూలే ప్రమాదమున్న భవనాలను తొలగిస్తామని హెచ్చరించారు. ఇటీవల గచ్చిబౌలిలోని అంజయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం కుప్పకూలి ఇద్దరు దుర్మరణం పాలవ్వడం, పక్కనే ఉన్న భవనాలు దెబ్బతినడం.. అలాగే దేశ రాజధానిలో ఈ నెల 6వ తేదీన ఓ హాస్టల్ భవనం కుప్పకూలి ఏడుగురు చనిపోవడం.. పలువురికి గాయాలైన ఘటనల నేపథ్యంలో హైడ్రా మరింత అప్రమత్తమైంది. నగరంలోని హాస్టళ్ల నిర్వాహకులతో పాటు.. వాటిని అద్దెకిచ్చిన భవన యజమానులతో బుధవారం హైడ్రా కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. చదువులతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వెతుక్కుంటూ నగరంలో వివిధ హాస్టళ్లలో నివాసముంటున్న వారి భద్రతకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. హాస్టళ్లలో ఫైర్ సేఫ్టీ, ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు, భవన నిర్మాణ పటిష్టత వంటి అంశాల్లో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం











చేశారు. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కాదు.. ప్రమాదం జరగకుండా చూడాలనేదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశమని గుర్తు చేశారు.

**మూడు కార్పొరేషన్లతో సమన్వయంగా తనిఖీలు..**

అనుమతి లేని భవనాల్లో హాస్టళ్ల నిర్వహించడంపై మూడు కార్పొరేషన్లతో సమన్వయం చేసుకుని తనిఖీలు, తదుపరి చర్యలు చేపడతామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. తక్కువ ఫీజులు వసూలు చేసి హాస్టళ్లలో ఉంటున్నవారి ప్రాణాలకు ముప్పు తేవద్దన్నారు. హాస్టల్‌లో పిల్లలకు మంచి వసతి, పూర్తి భద్రత కల్పించాలని.. డబ్బు కోసం భద్రతను పక్కన పెట్టొద్దన్నారు. హాస్టళ్లలో మీ పిల్లలే ఉంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారో అదే విధంగా నిర్వాహకులు ఆలోచించాలన్నారు. హాస్టల్ నిర్వహణకు ఓ భవనాన్ని ఎంచుకునే ముందు.. అగ్ని ప్రమాదం జరిగితే అందులో ఉన్న వారు సులభంగా బయట పడగలరా అనేది చూసుకోవాలి. అలాగే ఆ భవనం పటిష్టంగా ఉందా.. తగిన పార్కింగ్ సౌకర్యం ఉందా అనే విషయాలను సరి చూసుకోవాలి. 50 గజాల్లో 7 అంతస్తుల భవనాలు నిర్మిస్తే వాటిని సూసైడ్ బాంబర్లుగా పరిగణించాల్సి వస్తుందన్నారు. వీటితో పక్కన ఉన్న భవనాల భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది. అందుకే గచ్చిబౌలిలోని ఆంజయ్యనగర్‌లో కుప్పకూలిన భవనం పక్కనే అంతే ప్రమాదంగా ఉన్న భవనాలను ఆరింటిని తొలగించామన్నారు. పక్కనే ఉన్న సిద్ధిక్ నగర్‌లో కూడా 2024లో ఓ భవనం పక్కకు ఒరిగిన విషయాన్ని గుర్తు చేశారు. నగర వ్యాప్తంగా కొన్ని హాస్టళ్లను తనిఖీ చేయగా.. చాలావరకు నిబంధనలను ఉల్లంఘించినట్టు రుజువైందన్నారు. భవనాల్లో అగ్ని ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయి. వాటి నివారణకు ఎలాంటి నిబంధనలు పాటించాలి. అనుమతి లేని, కాలపరిమితి దాటిన కట్టడాలతో పొంచి ఉన్న ముప్పును హైడ్రా అదనపు డైరెక్టర్ వర్ల పాపయ్య వివరించారు. ఇందుకు సంబంధించిన వీడియోలను చూపించి జాగ్రత్తలను సూచించారు.

# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి



**హైదరాబాద్, నవతరం:** ప్రతిపక్ష బీఆర్ఎస్ కుట్రలను దీటుగా తిప్పికొట్టాలని, అదే సమయంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో ఆయన అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్ష (సీఎల్పీ) సమావేశంలో ఈ మేరకు పిలుపునిచ్చారు.

ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు పూర్తయిన సందర్భంగా, చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించేందుకే అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అయితే, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ సభా కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. అధికారం కోల్పోయినా బీఆర్ఎస్ నేతల్లో అహంకారం తగ్గలేదని ఆయన వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ సభ్యులు పోలీసులు, ప్రజాప్రతినిధులను దూషించడమే కాకుండా, మహిళా అధికారుల ముందే టీ-షర్టులు తీసి అసభ్యంగా ప్రవర్తించారని ముఖ్యమంత్రి ఆరోపించారు. స్పీకర్‌పై అత్యంత అభ్యంతరకర భాషను ఉపయోగిస్తూ, సభా కార్యక్రమాలకు విఘాతం కలిగించారని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వంపై జరుగుతున్న కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లిన వారిని ఈ సందర్భంగా సీఎం అభినందించారు. ప్రతిపక్షాల కుతుంత్రాలను బలంగా తిప్పికొట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలందరూ తప్పనిసరిగా అసెంబ్లీకి హాజరై, చర్చల్లో చురుకుగా పాల్గొనాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి సూచించారు.

# జాతి బిడ్డల పోరాటం

**జగద్గిరిగుట్ట, నవతరం:** కుత్బుల్లాపూర్ మండలం జగద్గిరిగుట్ట మహా ఆది జాంబవ దేవాలయ భూమిని కొంతమంది కబ్జాదారులు కబ్జా చేసి రూములు నిర్మిస్తూ అమ్ముకుంటున్నారు గతంలో గుడి కమిటీ సభ్యులు కంప్లైంటు చేయగా గుడి స్థలంలో అక్రమంగా నిర్మించినటువంటి నిర్మాణాన్ని తొలగించడం జరిగింది మళ్లీ అదే చోట అదే కబ్జాదారులు రాత్రికి రాత్రి మళ్ళీ నిర్మాణాన్ని చేపట్టారు ఈ అక్రమ నిర్మాణం పై చర్యలు తీసుకోవాలని మహా ఆది జాంబవ దేవాలయ కమిటీ సభ్యులు సోమవారం మండల కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ సర్వేనెంబర్ 348 /1 లో అక్రమంగా కబ్జాలకు పాల్పడుతున్న వారిపై ల్యాండ్ గ్రాఫింగ్ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి కబ్జాలను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎర్ర యాకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్వాల భాస్కర్, ఉపాధ్యక్షులు వల్లూరి బాబు, జాయింట్ సెక్రెటరీ సోమారపు రాజు, కచ్చి గళ్ళ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# మద్యం మాఫియా కొత్త దందా..

## అందమైన అమ్మాయిలు, విద్యార్థినీలతో బిజినెస్

**బీహార్, నవతరం:** మద్యపాన నిషేధం అమల్లో ఉన్న బీహార్‌లో మద్యం అక్రమ రవాణాకు మాఫియా సరికొత్త దారులు వెతుకుతోంది. పోలీసుల నిఘాను తప్పుదోవ పట్టించేందుకు అందమైన మధ్యతరగతి యువతులను పావులుగా మారుస్తున్న వైనం తాజాగా వెలుగుచూసింది. సమస్తిపూర్‌లో నేహా ఉదంతం మరవకముందే, రాజధాని పట్నాలో పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్న రియా అనే విద్యార్థిని అక్రమ మద్యం సీసాలతో పోలీసులకు చిక్కిన ఘటన కలకలం రేపింది.

**కొత్వాలి పోలీసుల నిఘా - పట్టుబడిన బైక్**

పట్నా జంక్షన్ పరిసర ప్రాంతాలకు భారీగా విదేశీ మద్యం అక్రమంగా సరఫరా కాబోతోందంటూ కొత్వాలి ఏఎస్పీ (లా అండ్ ఆర్డర్) కృష్ణ మురారి ప్రసాద్‌కు పక్కా సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు కొత్వాలి పోలీస్ స్టేషన్ పరిధిలో నిఘా ముమ్మరం చేశారు. అదే సమయంలో బైక్‌పై వెళ్తున్న రియాతో పాటు కొందరు యువకులను ఆపి తనిఖీ చేశారు. ఆమె వద్ద ఉన్న హ్యాండ్‌బ్యాగ్, షోల్డర్ బ్యాగ్‌లను పరిశీలించగా దాదాపు రూ.14,000 విలువైన అర డజనుకు పైగా విదేశీ బ్రాండెడ్ మద్యం సీసాలు బయటపడ్డాయి. వెంటనే పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

**డబ్బుల ఆశ చూపి.. నేరపు ప్రపంచంలోకి**

పోలీసుల విచారణలో దిగ్భ్రాంతికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. పట్నాకు చెందిన రియా సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన యువతి కాగా, ప్రస్తుతం ఉద్యోగం కోసం పోటీ పరీక్షలకు సిద్ధమవుతోంది. అయితే, సులభంగా డబ్బు సంపాదించవచ్చని కొందరు నమ్మబలకడంతో ఆమె ఈ అక్రమ మార్గాన్ని ఎంచుకుంది. తనకు పరిచయమున్న ఓ యువకుడు డబ్బుల ఆశ చూపడంతో ఉత్తరప్రదేశ్ వెళ్లి, అక్కడి నుంచి రైలు ద్వారా విదేశీ మద్యాన్ని పట్నాకు చేర్చినట్లు ఆమె అంగీకరించింది. తానెప్పుడూ ఇలాంటి పనులు చేయలేదని, కేవలం ఆర్థిక ఇబ్బందుల వల్ల డబ్బు ఆశతో మొదటిసారే ఈ తప్పు చేశానని వాపోయింది. రైలు దిగి బైక్‌పై వెళ్తుండగా పోలీసులకు చిక్కినట్లు తెలిపింది.

**సమస్తిపూర్ నేహా ఉదంతం తరహాలోనే..**

ఇలాంటి ఘటనే కొద్దిరోజుల క్రితం సమస్తిపూర్‌లోనూ చోటుచేసుకుంది. ఢిల్లీ నుంచి ఏసీ ఫస్ట్ క్లాస్ బోగీలో బ్రాండెడ్ మద్యం సీసాలను తన బావతో కలిసి బీహార్‌కు తరలిస్తుండగా నేహా అనే యువతి పోలీసులకు పట్టుబడింది. ఆ కుటుంబం మొత్తానికి ఈ దందాలో సంబంధం ఉందని, వారు ప్రముఖ డాక్టర్లు, సంపన్నులకే ప్రధానంగా ఈ మద్యాన్ని సరఫరా చేసేవారమని తేలింది. తాజాగా పట్నాలో పట్టుబడిన రియా వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరూ, ఈ మద్యాన్ని ఎవరికి అందజేయాల్సి ఉందనే కోణంలో కొత్వాలి పోలీసులు తీవ్రస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు. మద్యం మాఫియా యువతను ఏ విధంగా పావులుగా వాడుకుంటోందనే ఈ ఘటనలు సమాజంలో తీవ్ర చర్చకు దారితీశాయి.



# రేవంత్ రెడ్డిని కలిస్తే తప్పేంటి..

- నియోజకవర్గ నిధుల కోసమే సీఎంను కలిశానన్న రాజగోపాల్ రెడ్డి
- రేవంత్ రెడ్డితో అభిప్రాయ భేదాలు సహజమేనని వెల్లడి
- మంత్రి పదవులపై అధిష్ఠానమే నిర్ణయం తీసుకుంటుందని స్పష్టీకరణ
- కొండా సురేఖ విషయంలో సీఎం నిర్ణయంలో తప్పులేదని వ్యాఖ్య
- తాను, సీఎం గొడవపడాలని కొందరు చూస్తున్నారని ఆరోపణ

**హైదరాబాద్, నవతరం:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తన భేటీపై సాగుతున్న ప్రచారానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెరదించారు. ముఖ్యమంత్రి, తాను ఎప్పుడూ కలహించుకోవాలని కొందరు కోరుకుంటున్నారని ఆయన ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధికి, నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రిని, ఉప ముఖ్యమంత్రిని కలవడంలో తప్పేముందని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి పనుల నిమిత్తం వారిని కలవడం అనివార్యమని, దీనికి రాజకీయ అర్థాలు ఆపాదించవద్దని కోరారు.

ముఖ్యమంత్రితో తనకు అభిప్రాయ భేదాలు ఉన్న మాట వాస్తవమేనని, అయితే అవి సహజమైనవని రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రి పదవి కోసం తాను ముఖ్యమంత్రికి లొంగిపోయినట్లు కొందరు, ఇద్దరి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయని మరికొందరు చేస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. "ముఖ్యమంత్రిని కలిస్తే లొంగిపోయినట్లు, కలవకపోతే దూరం పెరిగినట్లు రకరకాలుగా ప్రచారం చేస్తున్నారు. నేను, సీఎం ఘర్షణ పడాలని కొందరు ఆశిస్తున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు.

మంత్రి పదవుల విస్తరణ అంశం పూర్తిగా పార్టీ అధిష్ఠానం పరిధిలోనిదని, గతంలో తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ లభించినట్లు రాజగోపాల్ రెడ్డి గుర్తు చేశారు. అధిష్ఠానం తీసుకునే ఏ నిర్ణయానికైనా తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

కొండా సురేఖ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరించిన తీరులో ఎలాంటి తప్పు లేదని, ఆయన అధిష్ఠానానికి సరైన సమాచారాన్నే అందించారని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భిన్నమైన అభిప్రాయాలు ఉండటం సహజమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం అందిస్తున్న రూ. 5 లక్షల ఆర్థిక సాయం స్వల్ప మొత్తమేమీ కాదని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు.



# ఎల్ నినోపై చంద్రబాబు సమగ్ర వ్యూహం

**అమరావతి, నవతరం:** రాష్ట్రంపై 'సూపర్ ఎల్ నినో' ప్రభావం పొంచి ఉన్న నేపథ్యంలో దానిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను సిద్ధం చేసింది. అమరావతిలో జరిగిన 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ అంశంపై లోతుగా చర్చించి, అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఎల్ నినో విపత్తును ఒక సవాల్‌గా స్వీకరించి, రైతులు, వినియోగదారులపై దాని ప్రభావం పడకుండా చూడటమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ఏ ఒక్కరూ నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, మంత్రులు, అధికారులు, కలెక్టర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా నీటిపారుదల ప్రాజెక్టుల ప్రాముఖ్యతను చంద్రబాబు నొక్కి చెప్పారు. "ఈ సీజన్‌లో తీవ్రమైన ఎల్ నినో పరిస్థితుల్లోనూ పట్టిసీమ ద్వారా 39.5 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు తరలించి లక్షల ఎకరాల పంటను కాపాడగలిగాం. ప్రస్తుతం పట్టిసీమ నుంచి 8,100 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా, ప్రకాశం బ్యారేజీకి 6,700 క్యూసెక్కులు చేరుతోంది. ఇదే స్ఫూర్తితో రాష్ట్రాన్ని కరవు నుంచి శాశ్వతంగా గట్టెక్కించే 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను రాబోయే మూడేళ్లలో పూర్తి చేయాలి" అని లక్ష్యం నిర్దేశించారు.

వెలిగొండ, పోలవరం ఎడమ కాలువ, హంద్రీనీవా పనులను వేగవంతం చేసిన జలవనరుల శాఖ మంత్రిని, అధికారులను అభినందించారు. నిర్దేశిత గడువు కంటే ముందే పనులు పూర్తి చేసే కాంట్రాక్టర్లకు, అధికారులకు ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించారు. ఎల్ నినో ప్రభావం కేవలం వ్యవసాయంపైనే కాకుండా, ద్రవ్యోల్బణం రూపంలో సాధారణ ప్రజలపైనా ఉంటుందని ముఖ్యమంత్రి హెచ్చరించారు. "పంటలు సరిగా పండకపోతే నిత్యావసరాల ధరలు పెరిగే ప్రమాదం ఉంది. దీనిని అరికట్టేందుకు మంత్రుల కమిటీ నిరంతరం పనిచేయాలి. రైతు బజార్లను చైతన్యవంతం చేయాలి. భవిష్యత్తులో డిమాండ్ ఉండే ఉల్లి, పప్పుధాన్యాలు, చిరుధాన్యాల వంటి పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలి. అవసరమైతే రాయితీలపై విత్తనాలు అందించి, కనీస మద్దతు ధర ప్రకటించే అంశాన్ని కూడా పరిశీలించాలి" అని సూచించారు.రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఏయే పంటలకు బీమా ఉందో గుర్తించి, ఆ పంటలు వేసేలా రైతులకు అవగాహన కల్పించాలని, పంట నష్టపోతే బీమా డబ్బులు అందేలా చూడాలని స్పష్టం చేశారు. తాగునీటి సమస్య తలెత్తకుండా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులను నింపాలని, వచ్చే వేసవి వరకు నీటి సరఫరాకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు. గతంలో తిరుమలకు నీటి ఎద్దడి వచ్చినప్పుడు 100 రోజుల్లో పైపులైన్ వేసి సంక్షోభాన్ని నివారించిన విషయాన్ని గుర్తుచేశారు. పశువుల దాణాకు కొరత రాకుండా, పచ్చదనం తగ్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాధార పంటలను ప్రోత్సహించడం, పశుగ్రాసం పండించడం, మల్చింగ్ కోసం విత్తనాలు వేయడం వంటి పనులు చేపట్టాలన్నారు. విత్తనాలను డ్రోన్ల ద్వారా చల్లే విధానాన్ని ప్రోత్సహించాలని, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. "విపత్తులను మనం ఆపలేం. కానీ, ప్రజలపై వాటి ప్రభావం పడకుండా చూడటమే ప్రభుత్వాల బాధ్యత. 2019 తర్వాత వచ్చిన ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలో చాలా ఇరిగేషన్ ప్రాజెక్టులు ఆగిపోయాయి. అవి పూర్తయి ఉంటే ఇప్పుడు ఇంత ఇబ్బంది ఉండేది కాదు" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

# రంగారెడ్డి జిల్లాలో రియల్టర్ ఆత్మహత్య

**హైదరాబాద్, నవతరం:** రంగారెడ్డి జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, హోమ్ ల్యాండ్ సంస్థ అధినేత రామ్ రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కందుకూరు మండలం నెదునూరు గ్రామంలోని తన ఫామ్‌హౌస్‌లో ఆయన బలవన్మరణం చెందారు. రామ్ రెడ్డి పటాన్‌చెరు ప్రాంతంలో సుమారు 280 ఎకరాల విస్తీర్ణంలో ఒక భారీ వెంచర్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి కొందరు రాజకీయ నాయకుల నుంచి ఆయనపై తీవ్ర ఒత్తిడి ఉన్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఆ ఒత్తిళ్లను తట్టుకోలేకే ఆయన ఈ తీవ్ర నిర్ణయం తీసుకుని ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



# ఢిల్లీలో బ్రిక్స్ పదష్టు..

**న్యూ ఢిల్లీ, నవతరం:** ఈ వారాంతంలో జరగనున్న ప్రతిష్ఠాత్మక బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు దేశ రాజధాని న్యూఢిల్లీ సర్వ సన్నద్ధమైంది. ఈ కీలక కార్యక్రమానికి భారత్ సిద్ధంగా ఉందని, ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ప్రకటించారు. సెప్టెంబర్ 12-13 తేదీల్లో జరిగే ఈ 18వ బ్రిక్స్ సదస్సు కోసం ఢిల్లీలోని భారత్ మండపం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ మేరకు ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా ఒక ప్రత్యేక వీడియోను పంచుకున్నారు. ప్రపంచ నేతలకు స్వాగతం పలికేందుకు సిద్ధమైన భారత్ మండపం వీడియోను షేర్ చేస్తూ, "బ్రిక్స్ 2026కు సర్వం సిద్ధం!" అని ఆయన పేర్కొన్నారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమాఫోసా, ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ సహా పలువురు సభ్య, భాగస్వామ్య, ఆహ్వానిత దేశాల నేతలు ఢిల్లీకి రానున్నారు. 2026 సంవత్సరానికి బ్రిక్స్ కూటమికి భారత్ అధ్యక్షత వహిస్తోంది. 'సుస్థిరత, ఆవిష్కరణ, సహకారం, పునరుత్థానం కోసం నిర్మాణం' అనే థీమ్‌తో ఈ సదస్సును నిర్వహిస్తోంది. "మానవత్వానికే ప్రథమ ప్రాధాన్యం" అనే ప్రధాని మోదీ దార్శనికతకు అనుగుణంగా ఈ థీమ్‌ను ఎంచుకున్నారు. అంతర్గత సహకారాన్ని బలోపేతం చేసుకోవడంతో పాటు, పరస్పర ప్రాధాన్యత ఉన్న ప్రపంచ, ప్రాంతీయ అంశాలపై నేతలు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.

సదస్సు నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు, ఇతర ఏజెన్సీలతో కలిసి రాజధానిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. దాదాపు 15,000 మంది పోలీస్ సిబ్బంది, 200 కంపెనీల పారామిలటరీ బలగాలను మోహరించారు. వీవీఐపీల రాకపోకల కారణంగా పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ప్రజలకు ముందుగానే సూచనలు జారీ చేశారు. భారత్ బ్రిక్స్ కూటమికి వ్యవస్థాపక సభ్యదేశం. 2012, 2016, 2021లో కూడా భారత్ అధ్యక్షత వహించింది. ఇప్పుడు నాలుగోసారి ఈ బాధ్యతను స్వీకరించింది. 2026తో బ్రిక్స్ కూటమి ఏర్పడి 20 ఏళ్లు పూర్తి కావడం మరో విశేషం. ఈ ఏడాది జనవరి 1న అధ్యక్ష బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి భారత్ దాదాపు 350కి పైగా సమావేశాలు, ఉన్నత స్థాయి కార్యక్రమాలను నిర్వహించి కూటమి వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేసిందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.









# ఏసీబీ చేతికి చిక్కిన సెక్రటేరియేట్ ఉద్యోగి..

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణ సచివాలయం లో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న ఆనందేశి రాఘవేందర్ మరియు టీఎస్ఐడీసీ కార్యాలయం లో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మేడి వినోద్ అనే నిందిత అధికారులు ఏసీబీ (సిటీ రేంజ్-II) అధికారులకు రెడ్-హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం కింద ఫిర్యాదుదారుకు సంబంధించిన వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌లను ప్రాసెస్ చేయడం మరియు మంజూరైన రూ. 2,00,000/- మొత్తానికి చెక్కు జారీ చేయడం, అలాగే మిగిలిన క్లెయిమ్ ప్రక్రియను పూర్తి చేయడం వంటి అధికారిక పనుల కోసం వీరు రూ. 1,00,000/- లంచం డిమాండ్ చేసి స్వీకరించారు. అంతకుముందు, రాఘవేందర్ ఫిర్యాదుదారు నుండి వినోద్ ద్వారా ఫోన్ పే



లావాదేవీ రూపంలో రూ. 5,000/- లంచం డిమాండ్ చేసి స్వీకరించారు. మేడి వినోద్ ఫిర్యాదుదారు నుండి రూ. 1,00,000/- లంచం మొత్తాన్ని స్వీకరించి, దానిని రాఘవేందర్ కు అందజేశారు. ఆ లంచం సొమ్ము (రూ. 1,00,000/-) రాఘవేందర్ నుండి స్వాధీనం చేసుకున్నారు ఏసీబీ అధికారులు. అందువల్ల, ఈ నిందిత అధికారులను జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం నాంపల్లిలోని మొదటి అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరుపరిచారు ఏసీబీ అధికారులు.

**1064 (టోల్ ఫ్రీ నంబర్)**

ఏదైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేసినట్లయితే, చట్టపరమైన చర్యల కోసం ప్రజలు ACB టోల్ ఫ్రీ నంబర్ 1064ను సంప్రదించాలని కోరడమైనది. అలాగే సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లైన వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్ (Telangana ACB), X/ట్విట్టర్ (@Telangana ACB) ద్వారా కూడా ACB తెలంగాణను సంప్రదించవచ్చు. ACBని సంప్రదించడానికి వీలుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మరియు ప్రముఖ బహిరంగ ప్రదేశాలలో ACB యొక్క QR కోడ్ ప్రదర్శించబడింది. బాధితుడు/ఫిర్యాదుదారు యొక్క పేరు మరియు వివరాలు గోప్యంగా ఉంచబడతాయి.

## ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా..

# కుర్తి మహేష్ రెడ్డి

**టేక్మాల్ / మెదక్, నవతరం:** మెదక్ జిల్లా టేక్మల్ మండలం ఎలకుర్తి గ్రామానికి చెందిన కుర్తి మహేష్ రెడ్డి అతి చిన్న వయసులోనే ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. 2011 లో ఎన్ఎస్‌యూఐ కళాశాల అధ్యక్షుడిగా ప్రారంభమైన ఆయన ప్రస్థానం 2012 నుండి 2013 వరకు టేక్మాల్ మండల అధ్యక్షుడిగా తర్వాత ఆందోల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా.. ఇలా జిల్లా స్థాయి అధ్యక్షుడిగా కొనసాగి.. మెదక్ జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం 2025 లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. గల్లీ నుండి ఢిల్లీ దాకా నిర్వహించిన పలు కార్యక్రమాల్లో పాల్గొని పలు అక్రమ కేసుల్లో అరెస్టయ్యారు. పార్టీ కార్యక్రమాల్లో ఆక్టివ్ గా పనిచేస్తున్న అతడు 2019 సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసి కేవలం 3 మూడు ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.



అయినా ఎలాంటి వెనుకంజ వేయకుండా తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అడుగుజాడల్లో నడుస్తూ.. పలువురి మన్ననలు పొందుతున్నారు. మారుమూల గ్రామం నుండి NSUI తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కుర్తి మహేష్ రెడ్డికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఇంతటి స్థాయికి చేరుకునేందుకు తన వెన్నంటి వుంది సహకరించిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు ఎన్ఎస్‌యూఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్తి మహేష్ రెడ్డి.

# ప్రతీ ఏటా డీఎస్సీ నిర్వహిస్తా..

**అమరావతి, నవతరం:** మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్ చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో స్పందించారు. ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహించి తీరుతామని, చేతనైతే ఆపాలని జగన్‌కు సవాల్ విసిరారు. తమ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో సుమారు 30 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. డీఎస్సీ, ఏపీపీఎస్సీకి మధ్య తేడా కూడా తెలియకుండా జగన్ మాట్లాడుతున్నారని విమర్శించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో లోకేశ్ ఓ వీడియో విడుదల చేశారు. "ఆంధ్ర రాష్ట్ర ప్రజలందరికీ నా హృదయపూర్వక నమస్కారాలు... ఈ రోజు మాజీ ముఖ్యమంత్రి జగన్ డీఎస్సీపై మళ్లీ ఆరోపణలు చేస్తున్నారు. నేను సూటిగా ప్రశ్నిస్తున్నా... డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి మధ్య తేడా మీకు తెలుసా? మీరు అధికారంలో ఉన్న ఐదేళ్లు మీరు భర్తీ చేసిన టీచర్ పోస్టులు సున్నా. అదే, మా ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేసిన వెంటనే తొలి సంతకం డీఎస్సీ ఫైలుపైనే పెట్టారు. అందుకే మా ప్రజాప్రభుత్వం దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని 16 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయడం జరిగింది.

డీఎస్సీపై మీరు అనేక పర్యాయాలు కోర్టుకు వెళ్లారు. మొన్న మీ ఎమ్మెల్సీ పిల్ వేసి సీబీఐ ఎంక్వైరీ కోరితే, కోర్టు తిరస్కరించింది. డీఎస్సీ ఆపాలని మీరు 300 కేసులు వేసినా, కోర్టు ఎక్కడా మమ్మల్ని తప్పుబట్టలేదు. మా విద్యాశాఖ అధికారులు ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి, మీరు ఆరోపిస్తున్న ప్రతి అంశానికి అద్భుతంగా సమాధానం చెప్పారు. అయినాగానీ మీరు డీఎస్సీపై విషం కక్కడం చాలా బాధాకరమన్నారు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్.

# ట్రాఫిక్ సిబ్బందిపై దాడి.. వ్యక్తి అరెస్ట్

**హైదరాబాద్, నవతరం:** నాంపల్లిలోని తాజ్ ఐలాండ్ జంక్షన్ వద్ద తమ అధికారిక విధులను నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసు సిబ్బందిని అడ్డుకోవడం, బెదిరించడం మరియు దూషించినందుకు గాను, ఒక ద్విచక్ర వాహనదారుడు మరియు అతని భార్యపై నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, సెప్టెంబర్ 07, 2026న అబిడ్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన హోమ్ గార్డ్ కె. రవీందర్ (HG నం. 5841), WASI వాణి శ్రీ మరియు HG విజయ్ కుమార్‌లతో కలిసి తాజ్ ఐలాండ్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ నియంత్రణ విధుల్లో ఉన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలను నమోదు చేయడానికి HG రవీందర్‌కు అధికారిక శాఖా పరమైన కెమెరాను అప్పగించారు. మధ్యాహ్నం సుమారు 3:30 గంటల సమయంలో, గాంధీ భవన్ నుండి నాంపల్లి టి-జంక్షన్ వైపు హెల్మెట్ లేకుండా ఒక ద్విచక్ర వాహనం (రిజిస్ట్రేషన్ నం. TS 09 GB 5336) రావడం HG రవీందర్ గమనించారు. నిబంధనల ప్రకారం, ఆయన ఆ ఉల్లంఘనను అధికారిక కెమెరాతో ఫోటో తీశారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన వాహనదారుడు వెంటనే యూ-టర్న్ తీసుకుని, రోడ్డుకు తప్పు వైపు నుండి వచ్చి సదరు అధికారిని నిలదీశాడు. విధి నిర్వహణలో ఉన్న అధికారిని ఆ వ్యక్తి అసభ్య పదజాలంతో దూషించాడు. అంతేకాకుండా, అతని భార్య కూడా ఆ సంఘటనను తన మొబైల్ ఫోన్‌లో రికార్డ్ చేస్తూ దూషణలకు దిగింది. వీరిద్దరూ అధికారి విధులకు ఆటంకం కలిగించి, ఆయన భద్రతకు ముప్పు కలిగించిన అనంతరం అదే వాహనంపై వేగంగా అక్కడి నుండి పరారయ్యారు. ఫిర్యాదు ఆధారంగా, నాంపల్లి పోలీసులు భారతీయ న్యాయ సంహిత (BNS)లోని సెక్షన్లు 132, 221 మరియు 352 (సెక్షన్ 3(5)తో కలిపి) మరియు మోటారు వాహనాల చట్టం (MV Act)లోని సెక్షన్ 194-D (సెక్షన్ 184తో కలిపి) కింద క్రైమ్ నం. 322/2026గా కేసు నమోదు చేశారు. త్వరితగతిన దర్యాప్తు చేపట్టిన నాంపల్లి పోలీసులు, ప్రధాన నిందితుడైన మహ్మద్‌ను అదుపులోకి తీసుకున్నారు.



రిజ్వాన్ (వయస్సు 28 సంవత్సరాలు, వృత్తి: సైన్‌బోర్డ్ వర్కర్, నివాసం: హైదరాబాద్)ను సెప్టెంబర్ 08, 2026న మధ్యాహ్నం 12:30 గంటలకు అరెస్టు చేసి, వాహనాన్ని (TS 09 GB 5336) స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని జ్యుడిషియల్ రిమాండ్ కోసం గౌరవనీయ న్యాయస్థానం ముందు హాజరుపరుస్తున్నారు. తమ చట్టబద్ధమైన విధులను నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బందికి ఎలాంటి ఆటంకం, బెదిరింపులు లేదా జోక్యం చేసుకున్నా కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజలకిచ్చిన ప్రతి హామీ నెరవేరాలి

**హైదరాబాద్, నవతరం:** సీఎల్పీ సమావేశంలో కాంగ్రెస్ శాసనసభ్యులతో వెయ్యి రోజుల ప్రజా పాలన, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషిని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించాను. ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపుపై ప్రతి ఎమ్మెల్యే అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. ప్రతిపక్షం ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలకు వాస్తవాలను వివరిస్తూ, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ముందుకు సాగాలని, తెలంగాణ ప్రగతి కోసం మరింత పట్టుదలతో పనిచేయాలని తెలిపారు.








అసెంబ్లీలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఎమ్మెల్యే శ్రీగణేష్, సికింద్రాబాద్ గణేష్ దేవాలయ కమిటీ సభ్యులు, అర్చకులు కలిసి శ్రీ గణపతి నవరాత్రి ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆహ్వానించారు. నవతరం, హైదరాబాద్

# ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లపై ప్రభుత్వం దృష్టి

**హైదరాబాద్, నవతరం:** తెలంగాణలో పునరుత్పాదక శక్తి (రెన్యువబుల్ ఎనర్జీ) రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, అందులో భాగంగా రిజర్వాయర్లపై 'ఫ్లోటింగ్ సోలార్ పవర్ ప్లాంట్లు' ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. శాసనసభ సమావేశాల్లో సోలార్ పవర్ ప్రాజెక్టులపై సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన సుదీర్ఘ వివరణ ఇచ్చారు. నీటిపారుదల, విద్యుత్ శాఖలు సంయుక్తంగా నాగార్జునసాగర్, శ్రీశైలం సహా రాష్ట్రంలోని పలు ప్రధాన రిజర్వాయర్లను దీనికోసం సమగ్రంగా పరిశీలిస్తున్నాయని చెప్పారు. ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు అధిక వ్యయం కావడం ప్రధాన సవాల్‌గా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు/సుంకాల వల్ల ఒక్క మెగావాట్ ప్రాజెక్టుపై దాదాపు రూ. 1.30 కోట్ల మేర అదనపు భారం పడుతోందని, ఈ నిబంధనలను కేంద్రం సడలిస్తే రాష్ట్రానికి సోలార్ విభాగంలో పెట్టుబడులు భారీగా వెల్లువెత్తుతాయని పేర్కొన్నారు.

రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, వ్యవసాయం పెరగడంతో విద్యుత్ డిమాండ్ ఏకంగా 19,000 మెగావాట్లకు చేరిందని తెలిపారు. పేదలు, రైతుల విద్యుత్ సబ్సిడీల కోసం ప్రభుత్వం ఏటా రూ. 19,000 కోట్లకు పైగా ఖర్చు చేస్తోందని వివరించారు.



గిరిజన ప్రాంతాల్లో ఉచిత సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు 'ఇందిరా సౌర గిరి జల వికాసం' పథకాన్ని అమలు చేస్తున్నట్లు భట్టి ప్రకటించారు. అమ్రాబాద్ పరిధిలోని 80 గ్రామాలను పూర్తిస్థాయిలో సోలరైజ్ చేసేందుకు పైలట్ ప్రాజెక్ట్ చేపట్టామని, అక్కడ స్వతంత్ర 'మైక్రో గ్రిడ్లు' నిర్మించేందుకు కసరత్తు జరుగుతోందన్నారు. సాధారణ రైతులు, ప్రజలు తమ ఇళ్లు, పొలాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.

# ఒక్కరోజే రూ.6.93 కోట్లు

**తిరుమల, నవతరం:** కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు సమర్పించే కానుకల ప్రవాహం కొనసాగుతోంది. తాజాగా, శ్రీవారి హుండీ ఆదాయం మరోసారి రికార్డు స్థాయికి చేరింది. గురువారం ఒక్కరోజే రూ. 6.93 కోట్ల ఆదాయం లభించినట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. ఇది ఇటీవలి కాలంలో నమోదైన అత్యధిక ఒక్కరోజు ఆదాయాలలో ఒకటి కావడం విశేషం.

గతంలో కేవలం మూడు సార్లు మాత్రమే హుండీ ఆదాయం రూ. 6 కోట్ల మార్కును దాటిందని, ఇప్పుడు ఇది నాలుగోసారి అని అధికారులు పేర్కొన్నారు. తిరుమల చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక ఒక్కరోజు హుండీ ఆదాయం 2023 జనవరి 2న వైకుంఠ ఏకాదశి పర్వదినాన వచ్చిన రూ. 7.68 కోట్లు. ఆ తర్వాత ఇదే అత్యధిక మొత్తం కావడం గమనార్హం. గతంలో 2022 అక్టోబర్‌లో రూ. 6.31 కోట్లు, 2018 జూలైలో రూ. 6.28 కోట్ల చొప్పున ఆదాయం సమకూరింది. ఇటీవల 2026 ఆగస్టు నెలలో కూడా ఒకేరోజు రూ. 6.1 కోట్ల ఆదాయం వచ్చింది.

వార్షికంగా చూస్తే, శ్రీవారి ఆదాయం గణనీయంగా పెరుగుతోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో శ్రీవారి హుండీ ద్వారా సుమారు రూ. 1,738 కోట్ల ఆదాయం నమోదైంది. సాధారణ రోజుల్లో శ్రీవారి హుండీకి సగటున రూ. 3 నుంచి 5 కోట్ల వరకు ఆదాయం వస్తుంటుంది. ప్రపంచంలోనే అత్యంత సంపన్న హిందూ దేవాలయాల్లో ఒకటిగా పేరుగాంచిన తిరుమల క్షేత్రానికి భక్తులు నగదు, బంగారం, వెండి, విదేశీ కరెన్సీ రూపంలో భారీగా కానుకలు సమర్పిస్తుంటారు. ఈ నిధులను టీటీడీ ఆలయ నిర్వహణ, అభివృద్ధి, అన్నప్రసాద వితరణ, ఇతర ధార్మిక సేవా కార్యక్రమాలకు వినియోగిస్తుంది.



# రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

**జగద్గిరిగుట్ట, నవతరం:** గణేష్ చతుర్థి వేడుకల దృష్ట్యా, ముందుజాగ్రత్తలో భాగంగా.. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి, హెచ్చరించారు స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎన్. నరేష్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా, వాంటెడ్ గా అల్లరి చేష్టలు చేసినా, ప్రజల శాంతికి భంగం కలిగించేలా ప్రవర్తించినా.. చట్టపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. గణేష్ చతుర్థి సందర్భంగా ప్రజల శాంతిభద్రతలకు పటిష్టమైన చర్యలు పోలీసు యంత్రాంగం తీసుకుంటుందని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. ఇందులో భూకబజాలు చేసిన సస్పెక్ట్ షీటర్లు, పలు నేర చరిత్ర కలిగిన రౌడీ షీటర్లున్నారు. కాగా, మరికొంతమంది తప్పించుకుతిరుగుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. అందుకే పోలీసుల కౌన్సిలింగ్ కు హాజరుకాలేదని తెలుస్తుంది.



# పోలీస్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం

**సైబరాబాద్, నవతరం:** సైబరాబాద్ పోలీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా ఎస్సై శ్రీనివాస్ (హెచ్‌సీ-3046), ఉపాధ్యక్షుడిగా ఇన్‌స్పెక్టర్ శ్రీకర్‌బాబు (19435) ఎన్నికయ్యారు. ఎస్సై / ఏఎస్సై కేటగిరీలో ప్రియదర్శిని (3251), హెడ్ కానిస్టేబుల్ కేటగిరీలో కార్తిక్ శ్రీనివాస్ (3276), పోలీస్ కానిస్టేబుల్ కేటగిరీలో రాజేందర్ (5180) వైస్ ప్రెసిడెంట్లుగా ఎన్నికయ్యారు. వివిధ పదవులకు మొత్తం 29 మంది సభ్యులు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ వారికి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ ద్వారా సిబ్బంది సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.




# బంగ్లాదేశ్ ఫినిష్..

మహిళల ఆసియా కప్ 2026లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. దుబాయ్ వేదికగా జరిగిన సెమీ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై 40 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఓపెనర్ షఫాలీ వర్మ (64) అద్భుత హాఫ్ సెంచరీతో చెలరేగగా, ఆల్‌రౌండర్ దీప్తి శర్మ బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది.




150 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్‌ను భారత బౌలర్లు సమర్థంగా కట్టడి చేశారు. ఆది నుంచి క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ ఒత్తిడి పెంచారు. భారత బౌలర్ల ధాటికి బంగ్లా బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలదొక్కుకోలేకపోయారు. షోర్నా అక్తర్ (22*) టాప్ స్కోరర్‌గా నిలిచింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ 3 వికెట్లతో బంగ్లా పతనాన్ని శాసించగా, నందని శర్మ రెండు వికెట్లు పడగొట్టింది. దీంతో బంగ్లాదేశ్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 109 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ విజయంతో టీమిండియా ఆసియా కప్ ఫైనల్‌లో అడుగుపెట్టింది. జరిగే రెండో సెమీఫైనల్లో పాకిస్థాన్, శ్రీలంక తలపడనున్నాయి. ఈ మ్యాచ్ విజేతతో ఆదివారం జరిగే ఫైనల్లో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది.

Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally (B.Tech, MBA, Journalism (NiMA), Ph.D(Hons) in Mass Communication & Journalism - Bureau Chief, Telangana, 9618907705, email: pressmanbharat@gmail.com, Telangana State Office: Plot No. A/9, Phase -I, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India.
https://epaper.navatharam.com